క్లుప్తంగా

ముగిసిన తర్బియత్ శిక్షణ



హజ్ యాత్రికులతో
మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్నవారికి ఇస్తున్న తర్బియత్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. హజ్ యాత్రికులకు ప్రభుత్వం వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మాట్లాడుతూ ముస్లింలకు హజ్‌యాత్ర అత్యంత పవిత్రమైనది అని అన్నారు. ప్రపంచ శాంతి కోసం యాత్రికులు ప్రార్థనలు చేయాలని, యాత్రను దిగ్విజయంగా పూర్తిచేసుకొని తిరిగిరావాలని ఆకాంక్షించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యులు ఫక్రుద్దీన్, కరీం, జుబేర్, హుసేన్, గౌస్ మొహినొద్దీన్, ఫరీద్, ఉబేద్, ఆరీఫ్, సాజిద్, మన్సూర్, అక్బర్, నవాబ్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

5కే రన్ జయప్రదం చేయండి

దుబ్బాకటౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా దుబ్బాకలో ఆదివారం నిర్వహిస్తున్న 5కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దుబ్బాక తహసీల్దార్, ఏఏఆర్‌ఓ వెంకట రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఓట్ ఫర్ షూర్..'రెడీ ఫర్ ఓట్' నినాదంతో దుబ్బాకలోని ఛత్రపతి శివాజీ విగ్రహం నుంచి ఉదయం 6.30 గంటలకు 5 కే రన్ ప్రారంభమవుతుందన్నారు.

వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం

నంగునూరు(సిద్దిపేట): పాలమాకులలోని వేంకటేశ్వరాలయ 12 వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఉదయం ఉత్సవ విగ్రహాలకు పల్లకి సేవ, అగ్నిప్రతిష్ఠ, పూర్ణాహుతి, అభిషేకం, అన్నసంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం 12 గంటలకు జరిగే కల్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్

దుబ్బాకటౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో ఎన్నికల అధికారులు ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగులు కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. ఫెసిలిటేషన్ సెంటర్ 8వ తేదీ వరకు కొనసాగనుంది. శనివారం సాయంత్రం వరకు 147 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు.

బండి గెలుపు ఖాయం

అక్కన్నపేట(హుస్నాబాద్): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హుస్నాబాద్ అసెంబ్లీ కో–ఆర్డినేటర్ కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. అక్కన్నపేట మండలం మల్‌చెర్వుతండా గ్రామంలో శనివారం బండి సంజయ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల నరేంద్ర మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రిజర్వేషన్లు రద్దు చేసేది లేదని మోదీ స్పష్టం చేసినప్పటికి కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేయడం తగదన్నారు.

మోదీని ఓడించాలి

చేర్యాల(సిద్దిపేట): కార్మిక వ్యతిరేకి మోదీని ఓడించి ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని ఆకునూరులో సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి జహంగీర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటువేసి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

గజ్వేల్‌రూరల్: గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైస్ ఎంపీపీ బెల్లె కృష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్(ఐఓసీ)లో గజ్వేల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులకు మద్దతు ధర అందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందించేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ఏవైనా సమస్యలుంటే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను సభలో చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీఓ ప్రవీణ్, ఎంపీఓ దయాకర్, ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నీరు లేక.. శ్రద్ధ చూపక

పర్యావరణ పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం హరితహారం చేపట్టింది. ఈ కార్యక్రమంలో ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా, ప్రతీ ఇంటిలో మొక్కలు నాటేలా ప్రోత్సహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు నిధులు కూడా విడుదల చేసింది. ప్రత్యేకంగా ఏటా హరితహారం నిర్వహించేలా ముందుగా నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టేలా కార్యాచరణ రూపొందించింది. అయితే పర్యవేక్షణ కొరవడంతో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి.



మర్రిముచ్చాల - కొమురవెల్లి దారిలో ఎండిన మొక్క

- ఎండుతున్న హరితహారం మొక్కలు
- నీరుగారుతున్న లక్ష్యం
- దుర్వినియోగమవుతున్న నిధులు
- పట్టించుకోని అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): హరితహారంలో రోడ్లకు ఇరువైపులా నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు మండల వ్యాప్తంగా ఎండిపోతున్నాయి. మొక్కలకు సకాలంలో నీరు పోయకపోవడం, సంరక్షించకపోవడంతో ఏపుగా పెరగాల్సిన మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొక్కలకు నీరు పోసినట్లు రికార్డుల్లో చూపిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

రికార్డుల్లో 70 శాతం

మండలంలోని రహదారులకు ఇరు వైపులా మొక్కలు పెంచాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. అయితే మొక్కలు నాటేందుకు చేయాల్సిన పనులు ఉపాధి హామీ పథకంలో చేర్చారు. ఇందుకు ప్రభుత్వం తన వాటా నిధులు మంజూరు చేసింది. మండలంలోని 11 గ్రామాల్లో గత సంవత్సరం 28 వేల మొక్కలు నాటారు. రికార్డుల్లో మాత్రం 60 నుంచి 70 శాతం మొక్కలు బతికి ఉన్నట్లు చూపుతున్నట్లు తెలిసింది. గుంతలు తవ్వడం, వాటిచుట్టు కంచే ఏర్పాటు, నీళ్ల పోయడం తదితర పనులకు ఇప్పటి వరకు రూ.లక్షలలో ఖర్చు చేశారు. నీళ్లు సక్రమంగా పోయకపోవడంతో పలు గ్రామాల్లో మొక్కలు ఎండిపోయాయి. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన అధికారుల నిర్లక్ష్యం వల్లే మొక్కలు ఎండిపోతున్నాయని ఆయా గ్రామాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బిల్లులు రాకపోవడంతో..

ప్రభుత్వం నుంచి సక్రమంగా బిల్లులు రాకపోవడంతో మొక్కల సంరక్షణకు గ్రామ పంచాయతీ అధికారులు శ్రద్ధ చూపడంలేదు. ప్రస్తుతం 2023–24 సంవత్సరంలో నాటిన మొక్కలకు మాత్రమే నీరందించేందుకు వీలుంది. అంతకు ముందు నాటిన మొక్కలను గ్రామపంచాయతీలు సంరక్షించాలి.

– బాలలింగం, ఏపీఓ, కొమురవెల్లి

సంరక్షణకు చర్యలు తీసుకుంటాం

నీళ్లు పోయకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి సంరక్షిస్తాం. మొక్కలు ఎందుకు ఎండిపోయాయో సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరతాం. నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

– కుమారస్వామి ఎంపీడీఓ, కొమురవెల్లి

మొక్కలను రక్షించాలి

డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు

మద్దూరు(హుస్నాబాద్): ఎండల నుంచి నర్సరీలో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు నర్సరీ నిర్వాహకులకు సూచించారు. శనివారం దూళ్మిట్ట మండల కేంద్రంతోపాటుగా బెక్కల్ గ్రామంలోని నర్సరీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నందున మొక్కల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మొక్కలకు నీళ్లు పోయాలని ఆదేశించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నర్సరీ సందర్శన

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల నర్సరీని ఎంపీడీఓ కుమారస్వామి శనివారం సందర్శించారు. నర్సరీలోని మొక్కలకు సక్రమంగా నీళ్లు పోయాలని పంచాయతీ కార్యదర్శి కరుణాకర్‌ని ఆదేశించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు.



దూళ్మిట్ట నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు

సీఎంను విమర్శించే స్థాయిలేదు

టీపీసీసీ సభ్యుడు చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే హరీశ్‌రావుది కాదని టీపీసీసీ సభ్యుడు దరిపల్లిచంద్రం అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేటలో హరీశ్‌రావు చేసిన అభివృద్ధి ఏమిటో చూపాలన్నారు. కోమటి చెరువు అభివృద్ధిలో రూ.కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో నూతన మార్కెట్ నిర్మించామని అంటున్నారని, ఈ మార్కెట్‌లో దుకాణాల కిరాయి బయట ఉన్న వాటికంటే రెండింతలు ఉన్నాయని, అభివృద్ధి పేరుతో లక్షల కోట్లు దండుకున్నారని విమర్శలు గుప్పించారు. బీఆర్‌ఎస్ పార్టీ 2014లో అధికారంలోకి రాగానే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పదేళ్లు పాలించిన కేసీఆర్ రూ.లక్ష రుణమాఫీ ఎందుకు చేయలేదని నిలదీశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదు అమలు చేశామన్నారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సూర్యవర్మ, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కో–ఆర్డినేటర్ దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు చంద్రం

కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

ఎంపీపీ మాలోతు లక్ష్మీ

అక్కన్నపేట(హుస్నాబాద్): అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటుతోనే బుద్ధి చెబుతారని ఎంపీపీ మాలోతు లక్ష్మీ అన్నారు. అక్కన్నపేట మండలం మంచినీళ్లబండ గ్రామంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా గ్రామంలో పార్టీ నేతలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే వందరోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మాటిచ్చి, ఇంత వరకు అమలు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామంటూ ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గంగాధరి సుగుణరాజయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మాలోతు భీలునాయక్, నాయకులు వెల్ది శోభరాణీ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ గడ్డ.. బీఆర్‌ఎస్ అడ్డ

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): మెదక్ గడ్డ అంటేనే బీఆర్‌ఎస్ అడ్డా అని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని అనంతగిరిపల్లి, నెంటూరులో పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటేసి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు.

కారు గుర్తుకే ఓటు వేయాలి

దుబ్బాకటౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దుబ్బాకలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం జోరందుకుంది. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా శనివారం ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత దుబ్బాకలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

మతోన్మాద పార్టీని ఓడించాలి

తొగుట(దుబ్బాక): మతోన్మాద పార్టీకి ఓట్లువేయొద్దని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని వరదరాజుపల్లి, ఎల్లారెడ్డిపేట, జప్తిలింగారెడ్డిపల్లి, బంజేరుపల్లి గ్రామాల్లో పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్, చౌడారం, పెద్దకోడూరు, మైలారం గ్రామాల్లో బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా శనివారం ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ పాలనలో ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో ..

నంగునూరు(సిద్దిపేట): బీఆర్‌ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా శనివారం నంగునూరు మండలంలో ఆ పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రైతులు, ఉపాధి కూలీలకు బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు.



అనంతగిరిపల్లి కట్టవద్ద ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలి

కొండపాక(గజ్వేల్): ప్రజల కోసం పనిచేసే బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, ఎస్ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యురాలు కోల సద్గుణ కోరారు. కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లి, రామునిపల్లి గ్రామాల్లో వెంకట్రామిరెడ్డికి మద్దతుగా శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఆ పార్టీలకు ఓటు వేయొద్దు

కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు వేసి మరిన్ని కష్టాలు తెచ్చుకోవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు బొద్దుల కనకయ్య, రాధాకిషన్‌రెడ్డి, తెలంగాణ జాగృతి అధ్యక్షుడు అనంతుల ప్రశాంత్ కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతోంది

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరగడంతో పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని గట్లమల్యాల మాజీ సర్పంచ్‌లు తిప్పని రమేశ్, కర్నకంటి రవీంద్రాచారి అన్నారు. గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు శనివారం టీపీసీసీ సంయుక్త కార్యదర్శి దేవులపల్లి యాదగిరి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు.

◆ బీజేపీని ఓడించండి

హుస్నాబాద్: అభివృద్ధి నిరోధక విధానాలను అవలంభిస్తున్న బీజేపీని ఓడించాలని కరీంనగర్ పార్లమెంట్ యూసీసీఆర్ఐ (యంఎల్)అభ్యర్థి గుడిసె మోహన్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ ప్రతిపక్షాలను దెబ్బతీయటానికి ప్రయత్నిస్తుందన్నారు. కార్మికులు, మధ్య తరగతి వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్నారు.

◆ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్ గ్రామానికి చెందిన శానగొండ శ్రవణ్ కుమార్‌ను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి శనివారం తెలిపారు. ఈ మేరకు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే, యూత్ రాష్ట్ర అధ్యక్షుడు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పూజలు చేశారు.

◆ కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం

కొండపాక(గజ్వేల్): ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నీలం మధును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా మండలంలోని గాగిళ్లాపూర్‌లో శనివారం ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

కేంద్రంలో పేదల ప్రభుత్వం రావాలి

ప్రొఫెసర్ వెంకట్ నారాయణ

హుస్నాబాద్: పదేళ్ల పాలనలో నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు పరోక్షంగా, ప్రత్యక్షంగా ఆర్థిక ప్రయోజనం కలిగించే పథకాలు అందించకపోవడం శోచనీయమని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ అన్నారు. పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనంలో శనివారం ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం, సామాజిక న్యాయం సాధించుకుందాం, కేంద్రంలో మార్పు కోరుకుందాం అనే రెండు పేజీల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం పదేళ్లుగా కుబేర్లను పెంచి పోషిస్తూ, పేద వర్గాలపై అపారమైన ఆర్థిక భారాన్ని మోపారన్నారు. కేంద్రంలో పేదల ప్రభుత్వం వస్తేనే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు భూ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ డాక్టర్ సంగని మల్లేశ్వర్, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, డాక్టర్ వంగల సుధాకర్, వీరన్న యాదవ్, రాజగోపాల్ రావు, సుధాకర్, ఫ్రాన్సిస్, లక్ష్మయ్య గౌడ్, వీర సోమయ్య పాల్గొన్నారు.

ఉన్నత స్థానంలో నిలిచినప్పుడే గుర్తింపు

ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ నిత్యానందరావు

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులు ఉన్నత స్థానాల్లో నిలిచినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, ఆ దిశగా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెల్దండ నిత్యానందరావు సూచించారు. పట్టణంలోని లక్ష్మణ్ గార్డెన్స్‌లో శనివారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి ఆధ్వర్యంలో కళాశాల 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణ, ఓర్పు, ఉదారత, సంయమనం పాటిస్తూ మంచి ఆలోచన విధానం కలిగి ఉండాలన్నారు. నారాయణఖేడ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ సమస్యలు వచ్చినపుడు కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. స్నేహభావంతో మెలగాలని, సమాజ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. జిజ్ఞాసలో రాష్ట్రస్థాయిలో ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థినులను అభినందించారు. కళాశాల టాపర్లుగా నిలిచినవారికి బంగారు పతకాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, సీడీసీ సభ్యులు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, లక్ష్మణ్, డాక్టర్ శైలజ, పరమేశ్వరాచారి, మధుసూదన్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

ముదిరాజుల అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజు

ములుగు(గజ్వేల్): ముదిరాజుల అభివృద్ధి మాజీ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని ముదిరాజు మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. మండల కేంద్రమైన ములుగులో శనివారం నిర్వహించిన ముదిరాజు ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. ముదిరాజుల ఆర్థికాభివృద్ధికి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేసారన్నారు. రాబోయె పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. కులాల పేరిట చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్న ఆయా పార్టీలకు తగిన బుద్ధి చెప్పేవిధంగా ముదిరాజులు కేసీఆర్‌కు అండగా ఉందామని పిలుపు నిచ్చారు. మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా గ్రామాల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే హరీశ్‌రావు, వెంకట్రామిరెడ్డితో వీడియో కాన్ఫరెన్స్‌లో ముదిరాజులతో మాట్లాడించారు.



మాట్లాడుతున్న కొట్టాల యాదగిరి ముదిరాజు

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, చేసిన అభివృద్ధిని చూసి లోక్‌సభకు పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా శనివారం పట్టణంలోని 16వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. పేదల పక్షాన నిలబడి పోరాడే వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అనిత, కౌన్సిలర్లు జనగామ రత్నమాల, పెరుక భాగ్యరెడ్డి, వాల సుప్రజ, హరీశ్, గోవిందు రవి, పట్టణ అధ్యక్షుడు అన్వర్, మాజీ ఎంపీపీ వెంకట్, కో ఆప్షన్ సభ్యులు శంకర్ రెడ్డి, అయూబ్, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రయ్య పాల్గొన్నారు.

కాషాయ జెండాను ఎగురవేద్దాం

గజ్వేల్‌రూరల్: బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించి మెదక్ గడ్డపై కాషాయ జెండాను ఎగురవేద్దామని ఆ పార్టీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, అసెంబ్లీ కోకన్వీనర్ బండారు మహేష్ పిలుపునిచ్చారు. రఘునందన్‌రావుకు మద్దతుగా శనివారం మండల పరిధిలోని జాలిగామలో పంజాల అశోక్‌గౌడ్, అసెంబ్లీ కోకన్వీనర్ సురేష్ ఆధ్వర్యంలో, కోమటిబండ, మక్తమాసన్‌పల్లి గ్రామాల్లో అసెంబ్లీ కోకన్వీనర్ బండారు మహేష్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీజేపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామాల్లో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిలో కేంద్ర నిధులున్నాయని తెలిపారు. రఘునందన్‌రావుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

పథకాలు వివరిస్తూ..

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం మాలపల్లి, రాంసాగర్‌పల్లిలో మండల బీజేపీ అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కమలం పువ్వుకు ఓటేసి బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని అభ్యర్థించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: బాలుర డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో ఎకనామిక్స్ సబ్జెక్టు బోధించే అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో ఎస్సీ, ఎస్టీలు 50 శాతం, బీసీ, ఓసీలు 55 శాతంతో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు అర్హులన్నారు. నెట్ లేదా సెట్ పాసైన వారికి, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈనెల 6వ తేదీ ఉదయం 11గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూ, డెమో క్లాసుల ద్వారా ఎంపిక ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలతోపాటు ఒక సెట్ జిరాక్స్‌తో హాజరు కావాలన్నారు.

బహిరంగ ప్రకటన

Sd/- Y. CHANDRA RUSHI, B.Sc., LL.B,
ADVOCATE & NOTARY,
Opp: Court Lane, Jangaon Dist, Cell: 9848430926

బహిరంగ ప్రకటన

Sd/- Y. CHANDRA RUSHI, B.Sc., LL.B.,
Advocate
1-3-273, Opp: Court Building, Brundavan Colony, JANGAON, Dist.: Jangaon, Cell: 9848430926

బహిరంగ ప్రకటన

Sd/- Y. CHANDRA RUSHI, B.Sc., LL.B,
ADVOCATE & NOTARY,
Opp: Court Lane, Jangaon Dist, Cell: 9848430926

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990